క్లుప్తంగా

## పలాస రైల్వేస్టేషన్‌లో ఏటీఎం సౌకర్యం




హిటాచీ ఏటీఎం సెంటర్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో ఎట్టకేలకు ఏటీఎం సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దుతో పాటు జిల్లాలో అత్యధిక ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో ఏటీఎం ఏర్పాటు చేయాలని పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ మెంబర్లు డబ్బీరు భవానీశంకర్, మీసాల సురేష్, పి.వి.సతీష్, బల్ల రేవతి, మల్లా సురేష్, విశ్వేశ్వరరావు రైల్వే ఉన్నతాధికారులకు పలు మార్లు వినతిపత్రాలు అందించారు. ఎట్టకేలకు వీరి కృషి ఫలించి ఏటీఎం (హిటాచి కంపెనీ) ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సహకరించిన జీఎం, డీఆర్ఎం, కమర్షియల్ మేనేజర్, ఇతర ఉన్నత అధికారులు, సిబ్బందికి అభివృద్ధి కమిటీ మెంబర్లు ధన్యవాదాలు తెలిపారు.

## 19న యు.వి.వి. వార్షికోత్సవం

పలాస: మండలంలోని నీలావతి గ్రామ గ్రంథాలయం ఆవరణలో ఈ నెల 19న ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యు.వి.వి) 22వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ ఆర్థిక కార్యదర్శి బి.చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతానికి చెందిన ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొత్త కార్యవర్గం ఎన్నిక, విధి విధానాలను రూపొందిస్తామని తెలిపారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 16 మందికి ఉద్యోగావకాశాలు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రముఖ ఎనర్జీవా కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ట్రిపుల్‌ఈ కోర్సులు పూర్తి చేసిన సుమారు 16 మంది విద్యార్థులు ఏడాదికి సుమారు రూ.5.4 లక్షల వేతన ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఓడీలు కె.కిరణ్‌కుమార్, బి.శివకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఎంవీఎస్ఎస్.సంతోష్‌కుమార్ అభినందించారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వజ్రపుకొత్తూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్.రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున శాంతి భద్రతల సమస్య రాకూడదని హెచ్చరించారు. ర్యాలీలు, ఉత్సవాలు, కల్చరల్ ఈవెంట్స్, సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. అలాంటి సందర్భం ఉంటే ముందుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: మండలంలోని కవిటి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ చర్యల్లో భాగంగా రాజపురం నుంచి కవిటి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్ పనులు చేపట్టేందుకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కవిటి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగడపుట్టుగ, గొండ్యాలపుట్టుగ, రామయ్యపుట్టుగ, కవిటి కొత్తూరు, కవిటి పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వాణీకుమారికి డాక్టరేట్



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. వాణీకుమారి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈమె తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో 'హైబ్రిడ్ సాఫ్ట్ కంప్యూటింగ్ విత్ డీప్ ఫీచర్ ఎక్స్‌ట్రాక్షన్ టు ప్రిడిక్ట్ బ్రెస్ట్ క్యాన్సర్ యూజింగ్ మామోగ్రఫీ ఇమేజెస్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రొఫెసర్ కె.ఉషారాణి పర్యవేక్షణలో ఈ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా వాణీకుమారిని ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, అధ్యాపకులు, సిబ్బంది గురువారం అభినందించారు.

## 18న వీరబ్రహేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేట నాగావళి తీరంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో స్వామివారి 331వ ఆరాధన మహోత్సవం ఈ నెల 18న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# ఉద్దానం నుంచి ఉత్తరాదికి..!



కాశీబుగ్గ నుంచి ఉత్తరాదికి పనసకాయలను ఎగుమతి చేస్తున్న దృశ్యం

- కొనసాగుతున్న పనస ఎగుమతులు
- కేజీ రూ.18 చొప్పన విక్రయం
- రోజుకు 50 టన్నుల ఎగుమతులు



బొడ్డపాడు నుంచి వచ్చిన పనసకాయల లోడు



పనసకాయలు కాటా వేస్తున్న వ్యాపారులు

కాశీబుగ్గ : ఉద్దానం పనసకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. ఇతర ప్రాంతాలతో పోల్చితే ఇక్కడి పనసకాయలు, పండ్ల రుచి అద్భుతం. అందుకే స్థానికంగానే కాకుండా ఇతర రాష్ట్రాలకు సైతం పెద్ద ఎత్తున ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రస్తుత సీజన్‌లోనూ పనసకాయల ఎగుమతులు జోరందుకుంటున్నాయి. సైజును బట్టి కేజీ రూ.18 వరకు ధర పలుకుతుండటంతో ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, హరిపురం ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో పనసకాయలు ఎగుమతి అవుతున్నాయి. ఒక్క పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల నుంచే రోజుకు 20 టన్నుల మేర లారీలు, వ్యాన్‌లో తరలిస్తున్నారు. పూండి, హరిపురం, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి ప్రాంతాలతో కలుపుకొంటే రోజుకు 50 టన్నులకు పైగా ఎగుమతి చేస్తున్నారు. ఫిబ్రవరి ఆఖరి నెల నుంచి ప్రారంభమైన ఈ ఎగుమతులు మే చివరి వరకు జరుగుతునే ఉంటాయి. ప్రస్తుతం కాశీబుగ్గ పట్టణ శివారులోని అక్కుపల్లి రోడ్డులో రైతుల నుంచి వ్యాపారులు పనసకాయలు కొనుగోలు చేసి ఉత్తరాది రాష్ట్రాలకు పంపిస్తున్నారు. పనసకాయలు ఏడాదంతా కష్టపడి పెంచుతున్నామని, ధరలను పెంచాలని కొంతమంది రైతులు కోరుతున్నారు.

### ఇతర రాష్ట్రాలలో గిరాకీ.

ఉద్దానంలో పండే పనస బరంపుం, కటక్, కోల్‌కతా, గుజరాత్ తదితర ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువ. పచ్చళ్లు, పకోడిలు, రసం తయారీలో పనసకాయలు వినియోగిస్తుంటారు. వీటితో పాటు పనస ముక్కల బిర్యానీ, పనస పొట్టు కూర, పనస పండు హల్వా, పనస గింజల కూర, పనస ముక్కల గూన చారు, పనస చిల్లి, పనస కాయ కుర్మా తదితర వంటకాలు తయారు చేస్తూ పెద్ద ఎత్తున వ్యాపారం సాగిస్తున్నారు.

### ప్రభుత్వమే ధర నిర్ణయించాలి..

పనసకాయలకు నిర్దిష్టమైన ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. వ్యాపారులు చెప్పినంతకే అమ్మకాలు చేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖాధికారులు స్పందించి పనస, మునగ తదితర పంటలకు కూడా ప్రభుత్వ పరంగా ధరలు నిర్ణయిస్తే తమకు మేలు జరుగుతుందని ఉద్దానరైతులు కోరుతున్నారు.

# మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన



కాశీబుగ్గ: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మాధురి

కాశీబుగ్గ: మధ్యవర్తిత్వం(మీడియేటర్)పై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం న్యాయవాదులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీడియేటర్ పాత్ర, మధ్య వర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ అహ్మద్, పైల రాజారత్నం నాయుడు, పి.ఎల్.నారాయణ, ఎల్.చంద్రశేఖర్, కోత రజనీకుమార్, బి.కె.ఆర్.పట్నాయక్, శ్యామ్, చిట్టిబాబు, గురుబెల్లి ప్రభాకర్, రవి పట్నాయక్, సుధారాణి, దావ్య, సూపరింటెండెంట్ పాణిగ్రాహీ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: న్యాయవాదులు మధ్య వర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలని ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్‌సెల్ చైర్మన్ పి.పరేష్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల కలిగే ఉపయోగాలు, పాటించాల్సిన నియమాలు వివరించారు.



ఇచ్ఛాపురం: విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు రమణయ్య, సీతయ్యరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, నాగరాజు పాత్రో, మనోజ్‌కుమార్, బైరాగిరెడ్డి, వినయ్‌చంద్ర పట్నాయక్, భగవాన్‌దాస్, వరలక్ష్మి, ప్రసాదరెడ్డి, రాంబాబు, కృష్ణమూర్తిరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్, ఉపాధ్యాయులు గగణకుమారి, ఉషారాణి పాల్గొన్నారు.

# వీడీవీ కేంద్రాలు లాభదాయకం



మాట్లాడుతున్న ఏపీడీ సన్యాసిరావు

వజ్రపుకొత్తూరు రూరల్: వన్ ధన్ వికాస్ కేంద్రాలు(వీడీవీకే)ల ద్వారా వ్యాపారాలు సాగించి లాభాలను పొందాలని టీపీఎంయూ వెలుగు ఏపీడీ డాక్టర్ సన్యాసిరావు అన్నారు. మందస మండలం వెలుగు కార్యాలయంలో గురువారం వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలు పండిస్తున్న అటవీ ఉత్పత్తులను దళారుల చేతిలో పెట్టి మోసపోకుండా నేరుగా వీడీవీ కేంద్రాల ద్వారా విక్రయాలు సాగిస్తే లాభదాయకమన్నారు. కాష్యూ ప్రాసెసింగ్ విధానం త్వరితగతిన చేపట్టి ఏడాదికి 5 టన్నుల జీడి పప్పును తయారు చేసి మార్కెంటింగ్ చేయాలన్నారు. గిరిజన రైతులకు ప్రభుత్వాలు రాయితీలు కల్పించి జీవన ప్రమాణాలు మెరుగుపరుతున్నాయని చెప్పారు. రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం నారాయణరావు, సుబ్బయ్యనాయుడు, సీసీలు, వీవోలు, ఎంఎస్ అధ్యక్షులు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల కిట్లు తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సోంపేట: రైతులు భూసారాన్ని పెంచుకోవడానికి ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల విత్తనాలు భూమిలో చల్లాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌చార్జి కుమారి అన్నారు. బారువ గ్రామంలో యూనిట్ స్థాయిలో నవధాన్యాల విత్తనాల కిట్లు గురువారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాల విత్తనాలు చల్లి కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. వరి పంట వేసే ముందు 12 కిలోల విత్తనాలు, జీడి మామిడి కొబ్బరి తోటల్లో 6 కిలోల విత్తనాలు చల్లుకోవాలన్నారు. దీనివల్ల నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది మొక్కకు సూక్ష్మస్థూల పోషకాలు అంది నేల సారవంతమవుతుందన్నారు. భూసారం పెరిగి రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్‌లు కృష్ణవేణి, పుష్పలత, దేవమ్మ, స్వాతి, జయలక్ష్మి, శ్రావణి, మమత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న యాజమాన్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఎం.తోటూరు సత్యసాయి హైస్కూల్ విద్యార్థులు పి.సాయికృష్ణ ఏపీఆర్‌జేసీలో 132 మార్కులు సాధించి 9వ ర్యాంకు, అదే పాఠశాలకు చెందిన ఎం.సాయి పాలిసెట్‌లో 115 మార్కులు సాధించి 169వ ర్యాంకు సాధించారు. వీరిని గురువారం పాఠశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సాహుకారి కృష్ణమూర్తి మాట్లాడుతూ క్రమశిక్షణతో పాటు ప్రణాళికతో చదివితే విజేతలవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కిరణ్‌కుమార్ లిమ్మాయి పాల్గొన్నారు.

# ఏపీఆర్‌జేసీ విజేతకు అభినందనలు



అమూల్యకు స్వీట్ తినిపిస్తున్న హెచ్ఎం గణేశ్వరరావు

కాశీబుగ్గ: ఇటీవల విడుదలైన ఏపీఆర్‌జేసీ– 2024 ఫలితాల్లో కొత్తపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నెయ్యిల అమూల్య బైపీసీ విభాగంలో 284వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం సవర గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గురువారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు స్వాతి, సింహాచలం బెహరా, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, సవర కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త మోడల్ స్విఫ్ట్ కారు ఆవిష్కరణ



కొత్త స్విఫ్ట్ కారును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: మారుతి సుజుకి సంస్థ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన కొత్త మోడల్ స్విఫ్ట్ కారును ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం ఆవిష్కరించారు. కంచిలిలోని మారుతీ సుజుకీ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్తు చామంతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంబరాలు



ఇచ్ఛాపురం రూరల్: కత్తిసాము చేస్తున్న ఒడిశా బాలికలు



ఇచ్ఛాపురం రూరల్: ప్రత్యేక జంగిడిలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ విగ్రహం

ఇచ్ఛాపురం రూరల్: పల్లెల్లో గ్రామదేవతలకు చల్లదనం పేరుతో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కమలాయిపుట్టుగ–లండపుట్టుగ గ్రామస్తులు నిర్వహిస్తున్న అసిరిపోలమ్మ ఉత్సవాలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి.

కంచిలి: మండలంలోని కేసరపడలో నిర్వహిస్తున్న గ్రామదేవత సింధుపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. గురువారం కూడా పెద్ద ఎత్తున భక్తులు ఉత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.



కంచిలి: కేసరపడలో గ్రామదేవత ఉత్సవాల్లో జనం



ఇచ్ఛాపురం రూరల్: కోలాటం ఆడుతున్న మహిళలు

## జీవధార



చిన్నపాటి అమెజాన్ నదిని తలపిస్తున్న ఈ దృశ్యం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల మధ్య ప్రవహించే బెండి గెడ్డలోనిది. మండు వేసవిలోనూ నిత్యం ప్రవహిస్తూ జీవధారగా నిలుస్తోంది. ఒడిశా సరిహద్దులో మహేంద్రగిరి పర్వతాల నుంచి వర్షాధారం, ఊటనీరుతో సుమారు 30 కిలోమీటర్లు పొడవునా మూడు మండలాలలో ప్రవాహిస్తూ చిన్నపాటి గెడ్డను తన ప్రవాహాన్ని కొనసాగిస్తూ నువ్వలరేవు సముద్రతీరపు పరలో కలుస్తుంది. అక్కడి నుంచి ఆటుపోటులకు లోనవుతూ నేరుగా బంగాళాఖాతంలోకి చేరుతుంది. పరిసర ప్రాంత ప్రజల అవసరాలకు, రైతుల పంట పొలాలకు, పశువులు తాగునీటి అవసరాలు తీరుస్తోంది. ఈ గెడ్డ ఎండినట్లు చరిత్రలో లేదని రైతులు చెబుతున్నారు. బెండిగేట్ పాత జాతీయ రహదారి వంతెన పైనుంచి రైలు వంతెన సమీపంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. - కాశీబుగ్గ

## రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న హరిప్రసాద్

శ్రీకాకుళం కల్చరల్: జెమ్స్ వైద్యకళాశాలలో చికిత్స పొందుతున్న డి.సుశీల అనే వృద్ధురాలికి సకాలంలో ప్లేట్‌లెట్స్ దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు దాత బి.హరిప్రసాద్. వివరాల్లోకి వెళ్తే.. సుశీలకు ప్లేట్‌లెట్స్ కౌంట్ పది వేలకు పడిపోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్‌ను సంప్రదించగా డోనర్ కోసం ప్రయత్నించగా దొరకలేదు. స్వచ్ఛంద సంస్థల సభ్యులుప్రయత్నించగా రాత్రి ఒంటిగంట సమయంలో కవిటి మండలం దూగానిపుట్టుగకు చెందిన బి.హరిప్రసాద్ రక్తదాతగా ముందుకొచ్చారు. శ్రీకాకుళం రక్తనిధి కేంద్రానికి వచ్చి వేకువజామున మూడుగంటలకు ఎస్డీపీ అందించి ఆమె ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా దాతను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, లయన్స్ బ్లడ్‌బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, సామాజిక సేవకులు ఉర్లం శివతేజ, ఉమాశంకర్, జి.మహాలక్ష్మీ, పాలకొండ ప్రశాంత్, సుప్రజ రౌత్, జాడ సాయి పాల్గొన్నారు.